
# పాడుతా... ఘాటుగా

- కాశీభట్ల శశికాంత్



"మీ అమ్మగారు చూడండి ఏం చేశారో" కోపంగా గదిలోకి వచ్చి భర్త ఆనందరావుతో అంది అరుణ.

"ఏం చేసింది" పేపర్లోంచి తలెత్తకుండా అన్నాడు ఆనందరావు.

"ఏమైనా చేస్తారు. మీరేమైనా పట్టించుకుంటున్నారా... ఏమన్నానా" అతని చేతుల్లోకి పేపర్ లాగేసుకుంటూ అంది అరుణ.

"అబ్బ... పేపర్ కూడా చదవనివ్వవా. ఇంతకీ... ఇప్పుడు నీకొచ్చిన సమస్యేమిటి" విసుగ్గా అన్నాడు ఆనందరావు.

"నాకు కాదు... సత్యవీణకి వచ్చింది."

"అదెవరు."

"సుశాంత్ భార్య."

"వాడెవడు."

"సత్యవీణ తలకి దెబ్బతగిలి ఈ జన్మ భర్త సుశాంత్‌ని మరచిపోయి గత జన్మ భర్త రాఘవ దగ్గరకు బయల్దేరిందని నిన్న రాత్రి చెప్పానుకదా... అప్పుడే మరచిపోయారా" కోపంగా అంది అరుణ.

ఆనందరావు టి.వి. సీరియల్స్ చూడడు. కానీ... ఏరోజు జరిగిన కథ ఆ రోజు రాత్రి పడుకునేముందు పూస గుచ్చినట్టు వివరిస్తుంది అరుణ. నిద్రలోకి జారుతూ సగం సగం వింటుంటాడు.

"ఓహో... టి.వి. సీరియల్ గొడవా" అన్నాడు.

"ఎంత తేలికగా అనేశారు. అయిదేళ్ళుగా నేను, మీ అమ్మగారు 'జీవితం ఒక అగాధం' సీరియల్ చూస్తున్నాం కదా. మీ చెల్లి సుధ వాళ్ళింటికి వెళ్ళి వారం రోజులున్నారోలేదో... వాళ్ళు చూసే 'కన్నీటి కెరటాలు' సీరియల్‌కి అలవాటుపడిపోయారు. వెక్కివెక్కి ఏడుస్తూ ఈ సీరియల్‌నే చూస్తూ టి.వి. వదలడం లేదు."

"ఏ సీరియల్ అయితేనేం ఏడవడానికని... పోనీ నువ్వుకూడా ఆ ఏడుపే ఏడుద్దూ."

"మీ అమ్మగారిలా రెగ్యులర్‌గా చూసే సీరియల్ని మార్చే రకాన్ని అనుకున్నారా నేను" పౌరుషంగా అంది. అంతలో హాల్లోంచి 'కుక్క...కుక్క' అని వినిపించింది.

"తలుపుతీసి వదిలేశావా... ఇంట్లోకి కుక్క వచ్చినట్టుంది"అని ఆనందరావు గబగబ హాల్లోకి వచ్చి "ఏది కుక్క" అన్నాడు తల్లితో చుట్టూ చూస్తూ.

"తనూజ గిరిధర్‌ని ఏమని తిట్టింది.కుక్క, నక్క, తొక్క.. కుక్క కరెక్ట్ ఆన్సర్" అంది జానకమ్మ ఎస్సెమ్మెస్ ఇస్తూ.

"ఆ కాంటెస్ట్‌లలో పాల్గొనద్దంటే వినరుకదా... మీ ఇద్దరి ఎస్సెమ్మెస్‌లకే నా శాలరీలో సగం ఖర్చయిపోతోంది" వాపోయాడు ఆనందరావు.

"ఆ సీరియల్ అయిపోయింది కదా. ఇప్పటికైనా ఛానల్ మార్చండి. 'సముద్రం' ఛానల్‌లో డాన్స్ పోటీలు వస్తాయి. పెట్టండి" అంది అరుణ.

"ఏముంది ఆ పోటీల్లో" చిరాగ్గా అంది జానకమ్మ.

"టి.వి.లో ఎడ్వర్టయిజ్‌మెంట్ చూడలేదా. ఆ పోటీలో జడ్జస్ కామెంట్స్ నచ్చక ఒకతను జడ్జీల మీదకు దాడిచేస్తే జడ్జిలందరూ కల్సి అతన్ని వంగోపెట్టి గుద్దుతారు."

"ఆ.. అవన్నీ ఉత్తుత్తివేట.. సుధ చెప్పింది" తేలికగా అంది జానకమ్మ.

అంతలో టి.వి.లో పాటల పోటీ ఎడ్వర్టయిజ్‌మెంట్ మొదలైంది. అది చూడగానే అరుణ మొహం వికసించింది.

"ఈనెల ముప్ఫయ్యో తారీఖునే మన ఊళ్ళో సెలక్షన్స్" హుషారుగా అంది అరుణ.

"నీకెందుకంత హుషారు.. పోటీకి వెళ్ళేదానిలా" వ్యంగ్యంగా అంది జానకమ్మ.

"అదేమిటమ్మా అలా అనేశావు. వారంరోజులుగా ఆ పోటీలకోసమే ప్రాక్టిస్ చేస్తోంది."

"తెల్లవారకుండానే ఎవరో గట్టిగా పాడారు. ఎవరిదా గొంతు".

"అదా.. అది పక్కింటి ప్రియది" అంది అరుణ. ప్రియ పేరు వినగానే మొహం ముడుచుకుంది జానకమ్మ. తనని అస్తమానం వేళాకోళంచేసే ప్రియంటే ఆవిడకు ఒళ్ళు మంట.

"బారెడు పొద్దెక్కితేనేగానీ లేచేది కాదుగా. కొత్తగా ఇదెప్పుడు మొదలెట్టింది" వ్యంగ్యంగా అంది.

"ఈమధ్య పొద్దున్నే లేచి తెగ ప్రాక్టిస్ చేస్తోంది లెండి. అంతేనా.. అప్పుడే తాను ప్రిలిమినరీస్‌లో సెలక్టయినట్టు, టి.విలో పాడేస్తున్నట్టు ఊహించుకుని తనకి ఎస్సెమ్మెస్‌ల ద్వారా ఓటువేయమని తెలిసిన వాళ్ళని, తెలియని వాళ్ళని అడిగేస్తోంది." మూతి తిప్పుతూ అంది అరుణ.

"అది అనుకుంటే సరిపోయిందా. అసలది ప్రిలిమినరీస్‌లో సెలక్టవ్వాలికదా" అంది జానకమ్మ.

"బాగా చెప్పారు" ఆనందంగా అంది అరుణ.

"అయినా నువ్వేమిటి ఎప్పుడూ కూని రాగాలు కూడా తియ్యని దానివి ఇలా పాటల పోటీకి తయారైపోయావు."

"ప్రియతో అరుణకి ఎప్పుడూ పోటీయే కదా. తను పదివేలు పెట్టి టి.వి. కొంటే నాచేత పదిహేనువేలు పెట్టి కొనిపించింది. వాళ్ళు వారానికి ఒక సినిమా చూస్తే మేము రెండు చూడాల్సిందే. వాళ్ళబ్బాయికి పొద్దున్నే అయిదింటికి లేపి చదివిస్తున్నారని మన కిరణ్‌గాడిని నాల్గింటికే లేపేసేది. వాడు తర్వాత స్కూల్లో కునికిపాట్లు పడేవాడు."

"సర్లేరా... ఇరుగుపొరుగు అన్నాక ఆమాత్రం పోటీ ఉండదూ. 'నిన్ను వదలను' సీరియల్‌లో విలీజరి ఒక పెళ్ళిచేసుకుంటే స్థితకీర్తి పోటీగా రెండు పెళ్ళిళ్ళు చేసుకోలేదూ. వాడలాగే మాట్లాడతాడు కానీ నువ్వు పట్టించుకోకు. నువ్వు సీరియస్‌గా ప్రాక్టిస్ చెయ్యాలేకానీ నీ ముందు అదెంత" అంది జానకమ్మ. ఆ మాటకి మురిసిపోయింది అరుణ. "మీ ఆశీర్వాదం ఉంటే చాలు.. విజయం సాధిస్తా" అంది అరుణ. ప్రియ మీద కోపంతో, సీరియల్ శతృత్వం మరచిపోయి వాళ్ళిద్దరూ 'అందరూ ఆత్మీయులే' సీరియల్‌లో సామీప్య, విహాల్యల్లా కలిసిపోయారు.

"అరుణా.. ఈ శుభ సందర్భంలో ఒక పాట పాడి వినిపించు."

అరుణ 'ఎవడ్రా నువ్వు' సినిమాలోంచి 'రాజమండ్రి గుంటని... రానిస్తే నీ జంటని" అనే పాట పాడి వినిపించింది. పాటంతా విని జానకమ్మ లేచి చేతులు వెనక్కి కట్టుకుని గంభీరంగా ఉండిపోయింది.

"ఎలా పాడాను" ఆత్రుతగా అంది అరుణ.

"ధ్వజస్థంభం లేని ఆలయం ఎలా ఉంటుంది" అంది జానకమ్మ.

"ఊహించడం కష్టం" అన్నాడు ఆనందరావు.

"సంధ్య దీపం లేని ఇల్లు" అడిగిందావిడ. ఆనందరావు ఏదో అనబోయేడు.

"స్వాతి కిరణంలో మమ్ముట్టిలా మీరు రాధికలా ఆయన డైలాగులు బాగానే చెబుతున్నారు. ముందు నా పాటలో లోపం ఏమిటో చెప్పండి" నిలదీసింది అరుణ.

"బాగానే ట్రై చేశావు. కానీ.. దానిలో గమకాలు లేవు" సీరియస్‌గా అంది.

"అవేమిటి" ఆశ్చర్యంగా అడిగారిద్దరూ.

"పోనీ.. సరిపెట్టుకుందామనుకున్నాను.. సంగతులు కూడా లేవే" అని నిట్టూర్చిందావిడ.

"మళ్ళీ ఇవేమిటి" కోరస్‌గా అన్నారిద్దరూ.

"ఏమోనమ్రా.. నాకూ తెలియదు" తాపీగా అందావిడ.

"బాగుందండీ.. అవేమిటో తెలియకుండానే లేవని ఎలా డిసైడ్ చేశారు. బహుశా ఉండే ఉంటాయి" దబాయింపుగా అంది అరుణ.

"నువ్వు పాడిన దాంట్లో ఏదో లోపం ఉంది. ఆ రెండూ లేకపోవడమే దానికి కారణమని నా నమ్మకం" తేల్చి చెప్పిందావిడ.

"భలే చిక్కొచ్చిపడిందే. అవేమిటో తెలియకుండా ఎలా పాడుతుంది" ఖంగారుగా అన్నాడు ఆనందరావు. అరుణ కాకినాడలో ఉన్న వాళ్ళ అక్కకి ఫోన్ చేసింది.

"అక్కా... నీ ప్రాక్టిస్ ఎలా జరుగుతోంది."

"బాగానే జరుగుతోంది.. ఏమిటి విశేషాలు."

"పాట పాడేటపుడు గమకాలు, సంగతులు కూడా ఉండాలిట.. నీకు తెలుసా."

"అలాగా.. ఎక్కడ దొరుకుతాయవి."

"అబ్బ... కొనేవి కాదక్కా. మనం మామూలుగా

పాడేస్తున్నాం కదా.. అలా చెయ్యకూడదట. పాటలు పాడేటపుడు దాంట్లో గమకాలు, సంగతులు పెట్టి మరీ పాడాలిట."

"ఏడిసినట్టుంది. ఇలా పాడటానికే తల ప్రాణం తోకకి వస్తోంది. అవన్నీ పెట్టి పాడాలంటే నావల్లకాదు బాబూ. ఇంతకీ అవేమిటి".

"ఏమో.. మాకూ తెలియదు."

"బాగుందే.. తెలియకుండా ఎలా.. సర్లే.. నువ్వు మీ ఊళ్ళో అడుగు నేనిక్కడ ట్రై చేస్తాను"అని ఫోన్ పెట్టేసింది.

* * *

మర్నాడు ఆనందరావు తనకి తెలిసిన వాళ్ళందర్నీ గమకాలు, సంగతుల గురించి అడిగాడు. ఎవరూ తెలియదనడంతో తనకి తెలిసిన సంగీతం మాస్టార్ని ఆయనింటి దగ్గర కలిశాడు.

"సంగీతం నేర్చుకోవడానికి చాలామందే వస్తున్నారే" అన్నాడు ఆనందరావు అక్కడున్న పిల్లలని చూసి.

"అవునండీ" నవ్వాడాయన.

"మీ అబ్బాయి పనీపాటా లేకుండా సినిమాలు చూస్తూ టైంపాస్ చేస్తున్నాడని చెప్పారు ఆమధ్య.. ఇప్పుడేం చేస్తున్నాడు."

"వాడి గురించి నాకింక ఏ బెంగా లేదు. డాన్స్ స్కూల్ పెట్టాడు. నాకన్నా బాగా సంపాదిస్తున్నాడు. ఈమధ్యే కారు కూడా కొన్నాడు. అంతా.. టి.వి. ఛానల్స్ వాళ్ళ దయ."

"మా ఆవిడ కూడా పాటల పోటీకి ప్రిపేరవుతోంది. మాకు కొన్ని డౌట్లున్నాయి."

"అడగండి."

"గమకాలంటే ఏమిటి? సంగతులంటే ఏమిటి".

"ఆవిడకు సంగీతం నేర్పించబోయారా."

"తనకి సంగీతం క్లాసులకి రావడం కుదరదండి" అన్నాడు ఆనందరావు.

మనసులో మాత్రం ఇలా అడిగి తెలుసుకుంటే పోయే దానికి సంగీతం నేర్చుకోవడానికి బోలెడు డబ్బు తగలెయ్యడం ఎందుకు దండగ అనుకున్నాడు.

"ప్రశ్నకి వంద రూపాయలవుతుంది" తాపీగా అన్నాడాయన.

"వీటికి కూడా డబ్బు తీసుకుంటారా" ఆశ్చర్యంగా అన్నాడు ఆనందరావు.

"ఇదివరకు ఊరికే చెప్పేవాళ్ళం. డిమాండ్ ఉన్నప్పుడే సంపాదించుకోవాలిగా."

"సరే.. చెప్పండి" అన్నాడు ఆనందరావు చేసేదేమీలేక. ఆయన వాటిని వివరించాడు.

"ఓస్ ఇంతేనా.. ఇంకా ఏమిటో అనుకున్నాను"అని ఆయనకి రెండొందలు ఇచ్చేసి ఆనందంగా ఇంటికి బయల్దేరాడు.

* * *

"అమ్మా.. అరుణా... రండి.. నాకు గమకాలు, సంగతులు తెలిసిపోయాయి" ఇంటికి వచ్చి హుషారుగా అరిచాడు ఆనందరావు. "నెమ్మదిగా మాట్లాడరా... ప్రియ వింటుంది" అంది జానకమ్మ ఖంగారుగా. అప్పటికే జరగకూడనిది జరిగిపోయింది. కందిపప్పు అప్పడగడానికి వచ్చిన ప్రియ ఆనందరావు మాటలు వినసే వినేసింది.

"అంటే... గమకాలంటే ఏమిటో కూడా తెలియకుండానే పాటల పోటీకి రెడీ అయిపోయావా... ఇంతకీ నీ గురువుగారు ఎవరు... మీ అత్తగారేనా"అని పగలబడి నవ్వేసింది ప్రియ. అంతటితో ఆగకుండా "ఏమండీ... ఈ సంగతి విన్నారా"అంటూ కందిపప్పు సంగతి మరచిపోయి వాళ్ళింటికి పరిగెత్తింది. తర్వాత వాళ్ళింట్లోంచి అదే పనిగా నవ్వులు వినిపిస్తుంటే అరుణ బిక్కమొహం వేసింది. జానకమ్మ పళ్ళు నూరుకుంటూ ఆలోచనలో పడింది.

* * *

"రేపు మన ఇంట్లో పార్టీ ఇస్తున్నాం. మన వీధిలో అందర్నీ పిలు" అంది జానకమ్మ ఒకరోజు ఆనందరావుతో.

"ఎందుకు పార్టీ" ఆశ్చర్యంగా అడిగాడు ఆనందరావు.

"అవన్నీ అడక్కు.. చెప్పింది చెయ్యి" ఆజ్ఞాపించారావిడ.

"ఏదో ఒక కారణం చెప్పాలిగా."

"ఏదో ఒకటి చెప్పు.. ఏదీ కుదరకపోతే నా పుట్టినరోజని చెప్పు."

"ఎందుకమ్మా దండగ ఖర్చు" ఇబ్బందిగా అన్నాడు ఆనందరావు.

ఆవిడ వినిపించుకోలేదు. పార్టీ ఇచ్చి తీరాల్సిందేనని పట్టుపట్టింది.

ఆనందరావు ఆవిడ చెప్పినట్టే ఇంట్లో పార్టీ ఎరేంజ్ చేశాడు. ఆ పార్టీలో జానకమ్మ ప్రియతో చాలా ఆప్యాయంగా మాట్లాడింది. పాటల పోటీలో నువ్వు కాకపోతే ఎవరు సెలక్టవుతారంది. 'నువ్వు భవిష్యత్తులో గొప్ప సింగర్‌వి అవుతావు' అని జోస్యం కూడా చెప్పింది. అదంతా చూస్తుంటే అరుణకి ఒళ్ళు మండిపోయింది. ఏమీ చెయ్యలేక "చాకిరి నాకు పొగడ్తలు దానికా"అంటూ భర్త దగ్గర వాపోయింది.

* * *

మర్నాడు ఉదయాన్నే ఎవరో తలుపులు దబదబ బాదితే ఉలిక్కిపడి లేచాడు ఆనందరావు. "తలుపు తియ్యండి...తలుపు తియ్యండి" అని అరుస్తున్నారెవరో. ఆనందరావు భయం, భయంగా వెళ్ళి తలుపుతీశాడు. బయట ప్రియ, వాళ్ళాయన నుంచుని ఉన్నారు.

"రెండో గొంతు నాది" సీరియస్‌గా అంది ప్రియ.

"అరె... జీరతో... మగవాడి గొంతులా వినిపిస్తోంది. పాటలతోపాటు మిమిక్రీ కూడా ప్రాక్టిస్ చేస్తున్నారా" ఆశ్చర్యంగా అన్నాడు.

"మిమిక్రీ కాదు పాడూకాదు. ఇదంతా పెద్ద కుట్ర.. తప్పుకోండి" అంటూ ప్రియ వాళ్ళాయన ఆనందరావుని తోసుకుంటూ లోపలికి దూసుకొచ్చారు. ఆ హడావుడికి అరుణ, జానకమ్మ హాల్లోకి వచ్చారు. ప్రియ, ఆమె భర్త జానకమ్మను ఇష్టమొచ్చినట్టు తిట్టారు. శాపనార్థాలు పెట్టారు. వాళ్ళెంత అరిచినా జానకమ్మ పెదవి విప్పలేదు.

"మా అమ్మను ఎందుకు తిడుతున్నారు" కోపంగా అడిగాడు ఆనందరావు. అప్పటికే తిట్టి తిట్టి అలిసిపోయి ఉన్నవాళ్ళు ఇంక చేసేదేమీ లేక ఆనందరావుకి కనీసం సమాధానం చెప్పకుండా విసురుగా వెళ్ళిపోయారు.

"ఏమైందమ్మా.. వాళ్ళెందుకు తిట్టారు" అయోమయంగా అన్నాడు ఆనందరావు. ఆవిడ టి.వి. సీరియల్లో లేడీ విలన్లా నవ్వింది.

"వాళ్ళు తిడితే నువ్వు నవ్వుతావేమిటి" చిరాకుగా అన్నాడు.

"నీకింకా అర్థంకాలేదా... ఆ ప్రియ గొంతు విన్నావు కదా".

"అయితే."

"పాపం... మందు కలిపిన కాఫీ ఇస్తే అమాయకంగా తాగేసింది. ఈ రోజు సెలక్షన్స్‌లో పాడటం కూడా అనవసరం. తన గొంతు తనకి రావడానికి కనీసం రెండురోజులు పడుతుంది" అంది జానకమ్మ ఆనందంగా.

"ఓహో... అందుకా నిన్నటి పార్టీ. అయినా... ఆ పని చేసింది నువ్వేనని వాళ్ళెలా పసిగట్టారు" అన్నాడు ఆనందరావు.

"ఈ ఇంట్లో అంతటి పథకం వెయ్యగల మేధావిని నేనేనని వాళ్ళకి తెలుసు" గర్వంగా అంది.

"ఆ కుట్రలు, కుతంత్రాల సీరియల్స్ చూడొద్దంటే వినవు కదా. అవి చూసి చూసి ఆఖరికి నువ్విలా తయారయ్యావు. పాపం... ఆ ప్రియని చూస్తే జాలేస్తోంది."అన్నాడు ఆనందరావు.

"దానికలా అవ్వాల్సిందే. కానీ.. అత్తయ్యగారూ... అలాంటి మందు ఉంటుందని మీకెలా తెలుసు. దానిని ఎలా సంపాదించారు" ఆనందంగా అంది అరుణ.

"మనసుంటే మార్గం ఉంటుంది. ఒక కోయవాడి ద్వారా ఆ మందు సంపాదించాను. లేకపోతే... మనని హేళన చేస్తుందా" పళ్ళు నూరుతూ అంది జానకమ్మ.

* * *

ఆ సాయంత్రం సెలక్షన్స్ జరిగాయి. ప్రియ ఆశ చావక ఆ గొంతుతోనే పాడేసింది. రిజల్ట్స్ వెంటనే చెప్పేశారు. అరుణ సెలక్టవలేదు. ప్రియ కూడా సెలక్టవలేదనే ఆనందం ఒకటే జానకమ్మ అండ్ పార్టీకి మిగిలింది. రెండు రోజులు గడిచాయి.

ఆరోజు ఉదయం మళ్ళీ తలుపులు దబదబ మోగడంతో లేచి వెళ్ళి తలుపు తీశాడు ఆనందరావు. బయట ప్రియ, వాళ్ళాయన అంతకుముందులానే నుంచుని ఉన్నారు.

"జరిగిందేదో జరిగిపోయింది. తిట్టాల్సినదంతా తిట్టేశారు. మళ్ళీ ఎందుకొచ్చారు. కొంపదీసి ఇలా రోజూ వస్తుంటారా" భయం భయంగా అన్నాడు ఆనందరావు.

వాళ్ళు ఆనందరావు మాట వినిపించుకోకుండా అలవాటుగా అతన్ని నెట్టుకుంటూ లోపలికి వచ్చేశారు. మొన్న తిట్లతో సరిపెట్టారు ఈసారి చేతికి పని చెబుతారేమోనని జానకమ్మ బెదురుగా నిలబడింది. ఆమె ఊహలను తల్లక్రిందులు చేస్తూ ప్రియ జానకమ్మ కాళ్ళమీద పడింది.

"సెలక్షన్స్ రోజున గొంతు పోవడంతో ఆవేశపడి తిట్టేశాం. క్షమించండి."

"మీ గొంతు బాగుపడిందే" అన్నాడు ఆనందరావు.

"అందుకే వచ్చాం. మొన్న మీరు వాడిన మందేమిటో చెప్తారా"

"ఎందుకు" అర్థంకాక ముగ్గురూ ఒకేసారి అని నాలిక కరుచుకుని.

"అబ్బే మాకేం తెలియదు" అన్నారు. ప్రియ వాళ్ళ మాటల్ని పట్టించుకోకుండా చెప్పుకుపోయింది.

"మొన్న జరిగిన సెలక్షన్స్‌ని నిన్న టి.వి.లో ప్రసారం చేశారు.. మీరూ చూశారుగా."

"అవును" ఆమె ఏం చెప్పబోతోందో అర్థంకాక అన్నారు.

"ప్రకాష్ అని కొత్త మ్యూజిక్ డైరెక్టర్ ఆ ప్రోగ్రాం చూశాడట. మగ గొంతుక కలిసున్న నా పాట విని ఒక అయిటమ్ సాంగ్ నాతో పాడించాలనుకున్నాడట. మా ఫోన్ నెంబర్ సంపాదించి ఇందాకే కాల్‌చేసి చెప్పాడు..." ఆమె ఇంకా చెబుతూనే ఉంది. అరుణ నిశ్చేష్టురాలైంది. జానకమ్మ నిలబడలేక పక్కనున్న కుర్చీలో కూలబడింది.

★

రచయిత చిరునామా:
కె.వి.ఎస్.డి.శశికాంత్,
ఎ-303, శ్రీ హరీశ్చంద్ర టవర్స్(ఫేజ్-2),
సజ్జాపురం,
తణుకు- 534 211.